# వరంగల్ వాయిస్
Evening Daily

సంపుటి : 04 | సంచిక : 326
పేజీలు : 08 | వెల: రూ.5/-
శనివారం
అక్టోబర్ 11, 2025
www.epaper.warangalvoice.net | www.warangalvoice.net




8లో..

## రైతులు ఆధునిక పద్ధతులు పాటించాలి

- కలెక్టర్ డాక్టర్ సత్య శారద





# సత్యాన్వేషి డాక్టర్ సత్యశారద

**వరంగల్ కలెక్టర్ గా విశిష్ట సేవలు | జిల్లా సమగ్రాభివృద్ధికి ఆరాటం**

**ప్రత్యేకత చాటుతున్న స్ఫూర్తి కార్యక్రమం | మూలాల్లోకి వెళ్లి ప్రజా సమస్యల పరిష్కారం**

సైంటిస్ట్ కావాలన్నది కొంతమంది కల. ఐఏఎస్ కావాలన్నది ఇంకొందరి కోరిక. ఈ రెండింటిని సాధించాలన్న ఆలోచన రావడమే సాహసం. దాన్ని అందుకోవడం ఓ అద్భుతం. పుష్కరకాలం క్రితమే ఆ రెండింటిని సాధించి తనకు సాటిలేరు మరెవ్వరని నిరూపించారు వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్య శారద. సైన్స్ గురించి మాట్లాడితే ఆమెలోని శాస్త్రవేత్త బయటికి వస్తారు. ఇంగ్లీష్ ప్రస్తావన తెస్తే ఓ మంచి లెక్చరర్ గా మారిపోతారు. సమాజం గురించి ప్రశ్నిస్తే ఆమె మనసులోని ఆవేదన కనిపిస్తుంది. విధుల్లో అలసత్వం వహించే అధికారులు, ఉద్యోగులను చూస్తే ఆమె కంఠం కాస్త కఠినంగా మారుతుంది. ఒక్క మాటలో చెప్పాలంటే ఆమె ఆలోచనలు.. అమలు విధానం ఇతర ఉన్నతాధికారుల వ్యవహార శైలికి భిన్నంగా ఉంటుంది. ప్రభుత్వ ఆదేశాలను కచ్చితంగా అమలు చేసే ఆమె.. ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ముందుంటారు. ముఖ్యంగా సమస్యల మూలాల్లోకి వెళ్లి పరిష్కరించే ప్రయత్నం చేస్తున్నారు. 16 జూన్ 2024న వరంగల్ జిల్లా కలెక్టర్ గా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ సత్య శారద జిల్లా సమగ్ర అభివృద్ధికి పాటుపడుతున్నారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలు అందిస్తున్నారు.

ప్రత్యేక కథనం 2లో..



8లో..

## ప్రణాళికతోనే గ్రామ అభివృద్ధి సాధ్యం

- ఏటూరు నాగారాన్ని మున్సిపాలిటీగా ఏర్పాటు చేస్తాం
- పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క

## వరంగల్‌ను స్టార్టప్ హబ్‌గా తీర్చిదిద్దుతాం

- కేయూ టి-హబ్ తో త్వరలో ఒప్పందం
- రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు
- పూర్వ విద్యార్థుల మద్దతు కీలకం





## రాష్ట్ర ఖ్యాతి పెంచాలి

- ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవ రెడ్డి
- ఖోఖో ఆటల పోటీలను ప్రారంభించిన జంగా
- సౌత్ జోన్ నేషనల్స్ కోసం మహిళా, పురుషుల జట్ల ఎంపిక

# సత్యాన్వేషి
# డాక్టర్ సత్యశారద





- వరంగల్ కలెక్టర్ గా విశిష్ట సేవలు
- జిల్లా సమగ్రాభివృద్ధికి ఆరాటం
- ప్రత్యేకత చాటుతున్న స్ఫూర్తి కార్యక్రమం
- మూలాల్లోకి వెళ్లి ప్రజా సమస్యల పరిష్కారం






గడ్డం
కేశవమూర్తి

హైదరాబాద్ కార్వాన్ లో విజయలక్ష్మి–శేషగిరిరావు దంపతులకు సత్య శారద జన్మించారు. ఉన్నత విద్యా శాఖలో పనిచేస్తున్న వరప్రసాద్ ను ఆమె వివాహం చేసుకుంది. ప్రస్తుతం ఆయన వరంగల్ లోని సీకేఎం కళాశాలలో అసోసియేట్ ప్రొఫెసర్ గా పనిచేస్తున్నారు. వీరికి కూతురు శ్రీహాన్వీ ఉంది. వీరి అన్న రాజశేఖర్ డీఆర్డీఓలో సైంటిస్ట్ గా పని చేస్తున్నారు. సత్య శారదా ఒకటో తరగతి నుంచి డిగ్రీ వరకు హైదరాబాద్ సెంట్ ఆన్స్ కళాశాలలో చదువుకున్నారు. అనంతరం యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాదులో ప్లాంట్ మాలిక్యులర్ జెనెటిక్స్ లో పీహెచ్ డీ పూర్తి చేశారు. కొంతకాలం సెంటర్ ఫర్ సెల్యులార్ అండ్ మాలిక్యులర్ బయాలజీ (సీసీఎంబీ) లో పోస్ట్ డాక్టర్ ఫెలోగా సేవలందించారు. ఆమె ఉన్నత విద్యాభ్యాసానికి తల్లితోపాటు అత్తయ్య కూడా ముఖ్య పాత్ర పోషించారు. ఇద్దరు విజయలక్ష్మిలు బాగా చదువుకోవాలని ఆమెను ప్రోత్సహించారు. వారిద్దరి తోడ్పాటుతో గ్రూప్ వన్ పరీక్షలు రాసి ప్రభుత్వ సర్వీస్ లోకి వచ్చారు.

## ఉద్యోగ ప్రస్థానం...

ఉన్నత విద్య పూర్తికాగానే డాక్టర్ సత్య శారద సివిల్స్, గ్రూప్స్ పరీక్షలు రాశారు. 2008లో ఐఎఫ్ఎస్ వచ్చినా అందులో చేరలేదు. 2009లో గ్రూప్ వన్ పోస్టు లభించడంతో విశాఖపట్నం జిల్లాలో శిక్షణ పూర్తి చేసుకున్నారు. 3 సెప్టెంబర్ 2009న నిజామాబాదులో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ గా నియమితులయ్యారు. తరువాత మహబూబ్ నగర్ లో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ గా సేవలందించారు. అనంతరం ఐదేళ్ల పాటు చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ (సీసీఎల్ఏ) లో ప్రత్యేక అధికారిగా విధులు నిర్వర్తించారు. అనంతరం వ్యవసాయ శాఖ జాయింట్ కమిషనర్ గా బదిలీ అయ్యారు. 2015 ఐఏఎస్ బ్యాచ్ కి చెందిన డాక్టర్ సత్య శారద 16 జూన్ 2024 న వరంగల్ కలెక్టర్ గా బదిలీపై వచ్చారు.

## జిల్లా అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి..

చారిత్రాత్మక వరంగల్ జిల్లా అభివృద్ధిపై కలెక్టర్ డాక్టర్ సత్య శారద ప్రత్యేక దృష్టి సారించారు. ఈ ప్రాంత ప్రజల చిరకాల స్వప్నమైన మామునూరు ఎయిర్ పోర్ట్ కలను సాకారం చేసేందుకు కృషి చేస్తున్నారు. విమానాశ్రయ భూసేకరణకు ప్రభుత్వం రూ.205 కోట్లు విడుదల చేసేలా చూశారు. భూసేకరణలో భాగంగా కన్సెంట్ అవార్డుకు ముందుకు వచ్చిన 48 మంది రైతుల బ్యాంకు ఖాతాలో రూ.34.84 కోట్లు జమ చేసి, విమానాశ్రయం భూ సేకరణ పనులను వేగవంతం చేశారు. జిల్లాలోని 11 మండలాల పరిధి 317 గ్రామాల్లో ఒకేరోజు రూ.25.31 కోట్ల వ్యయంతో కొత్త పనులకు భూమి పూజ చేయించారు. అదేవిధంగా ఉపాధి హామీ పథకం ద్వారా జిల్లాలో ఇప్పటివరకు లక్ష 62 వేల కుటుంబాలకు ఉపాధి చేకూర్చి 76 కోట్ల 37 లక్షల వేతనాలు చెల్లించారు.కాకతీయ మెగా వస్త్ర నగరి అభివృద్ధి పనుల్లో వేగం పెంచారు. స్థానిక యువతకు ఉపాధి, ఉద్యోగ కల్పనకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చే విధంగా చర్యలు తీసుకున్నారు. రూ.80 కోట్ల రూపాయల వ్యయంతో వరంగల్ లో నిర్మిస్తున్న సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనం (కలెక్టరేట్) పనులను శరవేగంగా పూర్తి చేయిస్తున్నారు. వరంగల్ పాత బస్ స్టేషన్ స్థానంలో అత్యంత అధునాతన సౌకర్యాలతో కొత్త బస్టాండ్ నిర్మాణ పనుల్లో జోరు పెంచారు. ఖిలా వరంగల్ కోట అభివృద్ధికి ప్రణాళికలు రచించారు. జిల్లాను పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నారు. ఔటర్ రింగ్ రోడ్డు, గ్రీన్ ఫీల్డ్ హైవే, ఇందిరమ్మ ఇళ్ల పనుల్లో వేగం పెంచారు. వరంగల్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మాణ పనులు వేగంగా కొనసాగేలా చర్యలు తీసుకున్నారు. అదేవిధంగా నర్సంపేటలో మెడికల్ కాలేజీ, హాస్పిటల్ ను ప్రారంభించుకుని కార్యకలాపాలు నిర్వహించడంలో కీలకపాత్ర పోషించారు.

## సేవలు భేష్...

ఉత్తర తెలంగాణ ప్రజలకు పెద్ద దిక్కుగా ఉన్న ఎంజీఎం ఆసుపత్రిలో పాలనను కలెక్టర్ సత్య శారద చక్కదిద్దారు. అలాగే,ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సమస్యలు పరిష్కరించి వసతులను మెరుగుపరిచారు. జిల్లాలో స్కానింగ్ సెంటర్లు ఉన్న అన్ని ఆసుపత్రులు కచ్చితంగా నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకున్నారు. లింగ నిర్ధారణ పరీక్షల నియంత్రణ చట్టాన్ని జిల్లాలో పక్కగా అమలు చేస్తున్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో గర్భిణులకు పౌష్టికాహారం అందిస్తున్నారు. ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాల కోసం అనువైన స్థలాలను గుర్తించి కేటాయించిన బడ్జెట్ ప్రకారం భవన నిర్మాణాలు పూర్తి చేసేలా చర్యలు తీసుకున్నారు. ముఖ్యంగా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించి వరంగల్ ను ఆరోగ్య జిల్లాగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నారు. ముఖ్యంగా జిల్లాలో ఉన్న అర్హులందరికీ రేషన్ కార్డులు అందజేశారు. భూభారతి దరఖాస్తులను పరిష్కరిస్తున్నారు. నిషేధిత జాబితాలోని భూములను రిజిస్ట్రేషన్లు చేయకుండా హుకుం జారీ చేశారు. అన్ని శాఖల అధికారుల వద్ద అప్డేట్ చేసిన నిషేధిత భూముల జాబితా ఉండేలా చర్యలు తీసుకున్నారు. విద్యారంగంపై ఫోకస్ పెట్టిన కలెక్టర్ సత్య శారద విద్యా రంగంలో పలు సంస్కరణలకు కృషి చేస్తున్నారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను మెరుగుపరచి ఉత్తమ ఫలితాలు సాధించేలా తీర్చిదిద్దుతున్నారు. విద్యాభివృద్ధికి కృషి చేస్తూనే.. స్పోర్ట్స్ హబ్ గా జిల్లాను తీర్చిదిద్దుతున్నారు. జిల్లాలో వ్యవసాయ రంగానికి పెద్ద పీట వేస్తూ.. రైతులకు ఎరువుల కొరతను, ప్రజలకు తాగునీటి సమస్యను తీర్చారు. పేదల సొంతింటి కల నెరవేర్చుతూ, పర్యావరణ పరిరక్షణకు వన మహోత్సవంలో అధికంగా మొక్కలు నాటారు.

## క్షేత్రస్థాయిలో పర్యటన..

వరంగల్ జిల్లాలోని అన్ని మండలాల్లో కలెక్టర్ డాక్టర్ సత్య శారద సుడిగాలి పర్యటనలు చేస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు క్షేత్రస్థాయి పర్యటనలు చేస్తూ, హాస్టల్ లో నిద్రలు చేస్తున్నారు.ప్రభుత్వాసుపత్రులు, హాస్టళ్లు, పాఠశాలలు ఆకస్మిక తనిఖీలు చేస్తూ వాటి నిర్వహణ, రికార్డులను పరిశీలిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు హెల్త్ చెకప్ చేయిస్తున్నారు. ఈవీఎం గోదాములను కూడా తనిఖీ చేస్తున్నారు. మెరుగైన వైద్య సేవలు, మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను పర్యవేక్షిస్తూ.. ఆసుపత్రుల్లో వైద్య సేవలు, సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను స్వయంగా వెళ్లి పరిశీలిస్తున్నారు. గ్రీవెన్స్ లో ప్రజలు ఇచ్చిన వినతులను తక్షణమే పరిష్కరింపజేసేలా చూస్తున్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇల్లుతో పాటు ఇతర ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకున్నారు. పేదల అభ్యున్నతే లక్ష్యంగా కలెక్టర్ సత్య శారద పనిచేస్తున్నారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులకు హెచ్చరికలు చేస్తున్నారు. తీరు మార్చుకోకుంటే చర్యలు తీసుకుంటున్నారు. తన పీహెచ్ డీ చదువుకు తగ్గట్లే జిల్లాలో సమస్యలను శోధిస్తున్నారు. విద్యార్థుల్లో ఆత్మ న్యూనత భావాలను పోగొట్టేందుకు ప్రతి శనివారం స్ఫూర్తి కార్యక్రమం నిర్వహిస్తున్నారు.












# 12న బీ.ఆర్ భగవాన్ దాస్ 22వ వర్ధంతి




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** సీనియర్ కమ్యూనిస్టు నేత, దివంగత కామ్రేడ్ బీ.ఆర్ భగవాన్ దాస్ 22వ వర్ధంతి కార్యక్రమాన్ని ఆదివారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నారు. హనుమకొండలోని అశోక జంక్షన్ వద్ద గల ఆయన విగ్రహం వద్ద నేతలు, ప్రజలు నివాళులర్పిస్తారు. భగవాన్ దాస్ తన జీవితమంతా పీడిత దళిత బహుజనులు, కార్మిక వర్గాల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పరితపించారు. ఆయన చేసిన అలుపెరుగని పోరాటాల్లో నేడు కార్యరూపం దాల్చిన కోచ్ ఫ్యాక్టరీ నినాదాన్ని ఎత్తుకొని, గల్లీ నుంచి ఢిల్లీ దాకా ప్రజలను కలుపుకొని గళం విప్పిన నేతగా ప్రసిద్ధి చెందారు. వరంగల్ జిల్లాలో ప్రతి కార్మికుడికి ఒక ట్రేడ్ యూనియన్‌ను స్థాపించి, వారి సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడిన నాయకుడిగా ఆయన చరిత్రలో నిలిచిపోయారు. ప్రతి సంవత్సరంలాగే ఈ సంవత్సరం కూడా అక్టోబర్ 12న జరగనున్న ఈ వర్ధంతి కార్యక్రమంలో ప్రముఖులు సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కల్లపల్లి శ్రీనివాసరావు, మాజీ డిప్యూటీ సీఎం, ప్రస్తుత ఎమ్మెల్యే కడియం శ్రీహరి, మాజీ మంత్రి, ఎమ్మెల్సీ బసవరాజు సారయ్య, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, వరంగల్ మేయర్ గుండు సుధారాణి, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి, కార్పొరేటర్లు వేముల శ్రీనివాస్, పోతుల శ్రీమాన్, చీకటి ఆనంద్, రావుల కోమల కిషన్, మైనార్టీ చైర్మన్ అజిస్ మీర్జా, మాజీ కార్పొరేటర్లు విద్యాసాగర్, కానుగంటి శేఖర్, వీరగంటి రవీందర్, జోరిక రమేష్ పాల్గొని నివాళులర్పిస్తారు. సీపీఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రే భిక్షపతి అధ్యక్షతన ఈ కార్యక్రమం జరుగుతుంది. కార్మికులు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరై కామ్రేడ్ బీ.ఆర్ భగవాన్ దాస్ కి ఘనంగా నివాళులర్పించాలని నిర్వాహకులు కోరారు.

## 12న "పుంజు తోక" కవితా సంపుటి ఆవిష్కరణ




**వరంగల్ వాయిస్, వరంగల్ :** తెలంగాణ రాష్ట్ర మాజీ డీజీపీ కొత్తకోట శ్రీనివాస రెడ్డి రచించిన "పుంజు తోక" కవితా సంపుటి ఆవిష్కరణ సభ ఆదివారం వరంగల్ వాగ్దేవి కళాశాల ఆడిటోరియంలో జరగనుంది.
ఈ పుస్తకాన్ని వరంగల్ కమిషనర్ అఫ్ పోలీస్ సన్ ప్రీత్ సింగ్ ఆవిష్కరించనున్నారు. ఈ కార్యక్రమానికి సభాధ్యక్షులుగా అంపశయ్య నవీన్, పుస్తక పరిచయం ఆచార్య బన్న ఐలయ్య, నాగిళ్ళ రామశాస్త్రి లు వ్యవహరించనున్నారు. చయిత కొత్తకోట శ్రీనివాస రెడ్డి గతంలో ఉమ్మడి వరంగల్ జిల్లా ఎస్పీగా పనిచేశారు. ఈ ప్రాంతంతో ఉన్న అనుబంధం, వరంగల్ పట్టణంలోని గొప్ప సాహితీ వాతావరణాన్ని దృష్టిలో ఉంచుకొని, ఆయన తన కవితా సంపుటి ఆవిష్కరణను ఇక్కడే నిర్వహించాలని నిర్ణయించుకున్నారు. ఈ కార్యక్రమాన్ని స్థానిక మిత్రమండలి వారు నిర్వహిస్తున్నారు. నగరంలోని పలు సాహితీ సంస్థలు తమ సంఘీభావాన్ని తెలియజేశాయి. సాహితీ ప్రియులు, సాహితీ వేత్తలు అధిక సంఖ్యలో హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మిత్రమండలి కన్వీనర్ వి.ఆర్ విద్యార్థి విజ్ఞప్తి చేశారు.

## ఘనంగా బొడ్రాయి వార్షిక మహోత్సవం

### మేయర్ గుండు సుధారాణి పూజలు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** రామన్నపేట, పాపయ్యపేట ప్రాంతాలలో వెలసిన భూలక్ష్మి, శ్రీ లక్ష్మీ, పోతరాజు సహిత బొడ్రాయి (గ్రామ దేవతలు) 8వ వార్షిక మహోత్సవం శనివారం నాడు భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా నిర్వహించిన బోనాల కార్యక్రమం, ఇతర పూజా కార్యక్రమాలలో నగర మేయర్ గుండు సుధారాణి పాల్గొన్నారు. రామన్నపేటలోని బొడ్రాయి వద్ద మేయర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన హోమం పూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొన్న మేయర్, అనంతరం భక్తులకు ప్రసాద పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ అడువాల గిరిధర్, భద్రకాళి ఆలయ ధర్మకర్త ఓరుగంటి పూర్ణ, వడ్నాల నరేందర్, హరినాథ్, వెంకటేశ్వర్లు, గొల్ల రాజయ్య, పూజారి కుమార స్వామి, లోకేష్, రుద్ర శ్రీను, తాళ్ళపెల్లి సంతోష్, ముప్పు సతీష్ (ఆర్.పీ.లు), బొడ్రాయి ప్రతిష్ఠాపన కమిటీ సభ్యులుపాల్గొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవార్లను దర్శించుకున్నారు.

## సమాచార హక్కు చట్టంపై అవగాహన



**వరంగల్ వాయిస్, వరంగల్ :** రంగశాయిపేటలోని 42వ డివిజన్ అంగన్వాడీ కేంద్రాలలో సమాచార హక్కు చట్టంపై అవగాహన సదస్సులు నిర్వహించారు. సమాచార హక్కు చట్టం వారోత్సవాలలో భాగంగా నిర్వహించిన ఈ సదస్సులో ఐసీడీఎస్ వరంగల్ ప్రాజెక్ట్ సూపర్వైజర్ బత్తిని రమాదేవి పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సూపర్వైజర్ మాట్లాడుతూ, పౌరులందరూ సమాచార హక్కు చట్టంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. అదేవిధంగా, పోషణ మాసం కార్యక్రమం సందర్భంగా అంగన్వాడీ కేంద్రాలలో పోషణ మాసం ప్రతిజ్ఞ చేయించడం జరిగింది. అలాగే, శిశువులకు అన్నప్రాసన కార్యక్రమాన్ని కూడా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు వినీత, యశోద, హైమావతి, ఆశ కార్యకర్తలు, అంగన్వాడీ ఆయాలు స్వరూప, జయ, ఏ.ఎల్.ఎం.సీ కమిటీ సభ్యులు, పిల్లల తల్లులు పాల్గొన్నారు.

## రేగూరి విజయపాల్ రెడ్డికి పరామర్శ



**వరంగల్ వాయిస్, పరకాల :** స్థానిక మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ రేగూరి విజయపాల్ రెడ్డి తల్లి రంగమ్మ అనారోగ్యంతో మరణించారు. శనివారం పరకాల పట్టణ కాంగ్రెస్ పార్టీ సమన్వయ కమిటీ సభ్యులు వారి పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అంతిమయాత్రలో పాల్గొన్నారు. నివాళులర్పించిన వారిలో మున్సిపల్ మాజీ చైర్మన్ సోదా రామకృష్ణ , మాజీ కౌన్సిలర్లు పంచగిరి జయమ్మ, నల్లెల్ల అనిల్ కుమార్, ఏకు రాజు, అడప రాము తదితరులు ఉన్నారు.

## పిల్లలకు పోలియో చుక్కలు తప్పక వేయించాలి



**వరంగల్ వాయిస్, ఆత్మకూరు :** ఐదు సంవత్సరాలలోపు పిల్లలందరికీ పల్స్ పోలియో ఇమ్యునైజేషన్ చుక్కలను విధిగా వేయించాలని ఆత్మకూరు మండల వైద్యాధికారి డాక్టర్ స్పందన తల్లిదండ్రులకు సూచించారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఆదివారం రోజున ఇప్పుడే పుట్టిన బిడ్డల నుంచి ఐదు సంవత్సరాలలోపు బాలబాలికలకు పోలియో చుక్కలు వేయించాలని కోరారు. ఆత్మకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) పరిధిలో ఈ కార్యక్రమం కోసం 19 బూత్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు వైద్య సిబ్బంది ఈ బూత్‌లలో పోలియో చుక్కలు వేస్తారని ఆమె వివరించారు. ఏదైనా కారణం చేత ఆదివారం పోలియో చుక్కలు వేయించలేని పిల్లల కోసం, అక్టోబర్ 13, 14, 15 తేదీల్లో వైద్య సిబ్బంది ఇంటింటికి వచ్చి పోలియో చుక్కలు వేస్తారని డాక్టర్ స్పందన తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

# బీసీల పట్ల చిత్తశుద్ధిని నిరూపించుకోవాలి

◆ బీజేపీ, బీఆర్ఎస్‌కు మహేందర్ గౌడ్ డిమాండ్

**వరంగల్ వాయిస్, భూపాలపల్లి :** బీసీ రిజర్వేషన్ల చట్టానికి రాష్ట్ర గవర్నర్ సకాలంలో ఆమోదం తెలిపి ఉంటే, హైకోర్టులో స్టే వచ్చేది కాదని బీసీ సంక్షేమ సంఘం జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు వేముల మహేందర్ గౌడ్ అభిప్రాయపడ్డారు. శనివారం భూపాలపల్లిలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, బీసీ రిజర్వేషన్ల విషయంలో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర కులగణన నిర్వహించడం నేరమా? బీసీ రిజర్వేషన్లు పెంచుతూ అసెంబ్లీలో చట్టం చేయడం పాపమా? అని మహేందర్ గౌడ్ బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలను సూటిగా ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఆర్డినెన్స్ పై గవర్నర్ ఇప్పటిదాకా సంతకం పెట్టకుండా తాత్సారం చేయడంతో, విధిలేని పరిస్థితుల్లోనే ప్రభుత్వం జీఓ జారీ చేయాల్సి వచ్చిందని ఆయన పేర్కొన్నారు. బీసీ రిజర్వేషన్ల విషయంలో రాజకీయ పార్టీలన్నీ డ్రామాలాడుతున్నాయని, ఒక పార్టీపై ఇంకొక పార్టీ నెపం నెట్టడం తప్ప బీసీలకు నిజమైన మద్దతు ఇవ్వడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి రిజర్వేషన్లు పెంచిన ప్రతిసారీ రిజర్వేషన్ వ్యతిరేకులు కోర్టులను వేదికగా చేసుకొని అడ్డుకుంటున్నారని, కోర్టులు కూడా బీసీలకు న్యాయం చేయడం లేదని ఆవేదన చెందారు. బీసీ రిజర్వేషన్లకు రాజ్యాంగ భద్రత దక్కడానికి 9వ షెడ్యూల్‌లో చేర్చాలని బీసీ సమాజం మొదటి నుంచి డిమాండ్ చేస్తున్నప్పటికీ, బీజేపీ నేతలు మాత్రం రిజర్వేషన్లు పెంచుకునే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికే ఉందని పదేపదే తప్పుదోవ పట్టించారని గౌడ్ మండిపడ్డారు. బీజేపీ నేతలు గవర్నర్‌ను కలిసి సానుకూల నిర్ణయం తీసుకునేలా చేసి ఉంటే బాగుండేదన్నారు. ఇది చేయకుండా బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలని బీజేపీ అనడం సిగ్గుచేటన్నారు. బీసీల పట్ల చిత్తశుద్ధితో పనిచేస్తున్నదెవరు? బీసీలను రాజకీయంగా వాడుకుంటున్నదెవరు? అనే విషయాన్ని ప్రజలు గమనిస్తున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ ప్రకారం సమగ్ర కుల గణన నిర్వహించి, బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తానంటే.. బీజేపీ, బీఆర్ఎస్ నాయకులకు కడుపు మండుతోందని విమర్శించారు. ఇకనైనా ఈ రెండు పార్టీలు డ్రామాలు ఆపి, బీసీ రిజర్వేషన్ల కోసం చిత్తశుద్ధితో పనిచేయాలని మహేందర్ గౌడ్ హితవు పలికారు.



## రేగూరి రంగమ్మ పార్థివ దేహానికి చల్లా నివాళి



**వరంగల్ వాయిస్, పరకాల :** బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, పరకాల మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ రేగూరి విజయపాల్ రెడ్డి తల్లి రేగూరి రంగమ్మ నిన్న సాయంత్రం మృతిచెందారు. ఈ విషయం తెలుసుకున్న పరకాల మాజీ శాసనసభ్యులు చల్లా ధర్మారెడ్డి రంగమ్మ నివాసానికి చేరుకున్నారు. చల్లా ధర్మారెడ్డి రంగమ్మ పార్థివ దేహాన్ని సందర్శించి, పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం, ఆయన కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆమె మృతికి గల కారణాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. మాజీ ఎమ్మెల్యే వెంట పరామర్శించిన వారిలో పరకాల నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యూత్ నాయకులు ఉన్నారు.

## లీగల్ సెల్ కోఆర్డినేటర్‌గా సాజిదా బేగం



**వరంగల్ వాయిస్, ఆత్మకూరు :** మండల కేంద్రానికి చెందిన సాజిదా బేగం జిల్లా న్యాయ సేవా సాధికారిక సంస్థ లీగల్ సెల్ కోఆర్డినేటర్ గా ఎన్నికయ్యారు. ఈ మేరకు జిల్లా న్యాయ సేవా సాధికారిక సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి క్షమా దేశ్ పాండే ఉత్తర్వులు జారీ చేశారు. సాజిదా బేగం గతంలో పలు స్వచ్ఛంద సంస్థల్లో పనిచేసి, రక్తదాన శిబిరాలు వంటి అనేక సామాజిక కార్యక్రమాలలో చురుకుగా పాల్గొన్నారు. ఇటీవల సేవా కార్యక్రమాల్లో పాల్గొంటూ ఆమె పలు సేవా అవార్డులను సైతం సొంతం చేసుకున్నారు. ఈ సందర్భంగా సాజిదా బేగం మాట్లాడుతూ కోఆర్డినేటర్ గా తాను ముఖ్యంగా గ్రామాల్లోని మహిళలు, వృద్ధులకు ఉచితంగా న్యాయపరమైన సేవలు అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ప్రజలకు కోర్టులు, చట్టాలపై అవగాహన కల్పించడం, సలహాలు, సూచనలు అందించడం తన వంతు బాధ్యతగా చేస్తానని పేర్కొన్నారు.

## బాలికల ఎదుగుదలకు తోడ్పాటునందించాలి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** బాలికల ఎదుగుదలకు, వారి రక్షణకు, విద్యకు సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతగా తోడ్పాటునందించాలని అనురాగ్ హెల్పింగ్ సొసైటీ చైర్మన్, కాకతీయ విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యులు డాక్టర్ అనితా రెడ్డి అన్నారు. అంతర్జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా పలు ప్రభుత్వ బీసీ, ఎస్సీ బాలికల హాస్టళ్లను సందర్శించిన అనంతరం ఆమె మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. సమాజంలో ఆదరణ, నిరాదరణకు గురైన బాలికలను చేరదీసి వారికి విద్యాబుద్ధులు నేర్పించడంలో, రక్షణ, ధైర్యం కల్పించడంలో ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థలు కూడా ముందుకు రావాలని ఆమె పిలుపునిచ్చారు. బాలికల అభివృద్ధికి విద్య చాలా దోహదపడుతుందని తెలిపారు. నిరుపేదలైన తల్లిదండ్రులు బాలికల రక్షణ, సంరక్షణ కోసం తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి సంక్షేమ కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని కోరారు. ప్రతి తల్లిదండ్రి తమ బాలికలకు బాల్యవివాహాలు చేయకుండా, బాల కార్మికులుగా మార్చకుండా వారికి సరైన దిశానిర్దేశం చేయాలని సూచించారు. బాలల రక్షణ, సంరక్షణ కోసం గ్రామ, మండల, జిల్లా స్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామని, బాలల హక్కుల పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అనితా రెడ్డి అన్నారు. బాలికలు తమ ఆలోచనలను పంచుకొని, వాటిని ఆచరణలో పెట్టుకోగలిగే స్థానంలో ఉన్నప్పుడే నిజమైన బాలికల దినోత్సవం అని ఆమె పేర్కొన్నారు. బాలికలకు అందమైన బాల్యాన్ని బహుమతిగా అందించాలని డాక్టర్ అనితా రెడ్డి ఆకాంక్షించారు.

## ఉపాధ్యాయులు అంకితభావంతో విధులు నిర్వర్తించాలి

◆ డీఈఓ రంగయ్య నాయుడు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** నాణ్యమైన విద్య అందించేందుకు ఉపాధ్యాయులు తమ విధులను అంకితభావం, బాధ్యతలతో నిర్వర్తించాలని వరంగల్ జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ) రంగయ్య నాయుడు సూచించారు. శుక్రవారం సాయంత్రం వరంగల్ డీఈఓ కార్యాలయంలో ఎయిడెడ్ జాక్ కన్వీనర్ ఎం.ఎ.కె. తన్వీర్ ఆధ్వర్యంలో జాక్ సభ్యులు డీఈఓ రంగయ్య నాయుడుని మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. గతంలో ఎయిడెడ్ ఉపాధ్యాయుల పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జాక్ సభ్యులు డీఈఓకి వినతిపత్రం అందజేశారు. డీఈఓ రంగయ్య నాయుడు వెంటనే స్పందించి, ఎయిడెడ్ ఉపాధ్యాయుల సమస్యలైన గ్రాంట్ ఇన్ ఎయిడ్, పెన్షన్ ప్రపోజల్, పెండింగ్‌లో ఉన్న అనేక ఫైళ్లు, సరెండర్ బిల్లులు, స్పెషల్ ఇంక్రిమెంట్లు, సప్లిమెంటరీ బిల్లులు మొదలైన వాటిని సకాలంలో పూర్తి చేసినందుకు కృతజ్ఞతగా డీఈఓకు శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా డీఈఓ రంగయ్య నాయుడు మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవచ్చని సూచించారు. అనంతరం డీఈఓ కార్యాలయ సూపరింటెండెంట్ బాబ్జీని కూడా జాక్ సభ్యులు శాలువాతో సన్మానించారు. సూపరింటెండెంట్ బాబ్జీ మాట్లాడుతూ, డీఏకు సంబంధించిన బిల్లు తయారీకి తగిన చర్యలు తీసుకుంటామని, జీతాల బిల్లులు సకాలంలో డీఈఓ కార్యాలయానికి పంపితే వెంటనే వాటిని పూర్తి చేయిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎయిడెడ్ జాక్ కో-కన్వీనర్ శ్రీధర్, మొహసిన్ ద్దిన్, యాకూబ్, చందర్ రావు, శ్రీనివాస్ గౌడ్, కృష్ణ రావు, జామా తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పోషణ మాసోత్సవాలు



**వరంగల్ వాయిస్, చిట్యాల :** మండల కేంద్రంలో పోషణ మాసోత్సవాలను పురస్కరించుకుని శనివారం పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. చిట్యాల ఒకటవ కేంద్రంలో జరిగిన ఈ కార్యక్రమాలలో పౌష్టికాహారం, ఆరోగ్యకరమైన జీవనశైలి గురించి ప్రజలకు వివరించారు. ప్లాస్టిక్‌ను తగ్గించి, కాటన్ బ్యాగులు, ఇత్తడి, స్టీలు, రాగి బాటిల్స్ వంటి వాటిని వాడాలని సూచించారు. కేంద్రాలలో, ఇళ్లలో కిచెన్ గార్డెన్ (పెరటి తోటలు) పెంపకం ఆవశ్యకతను తెలిపారు. పరిసరాలు, వ్యక్తిగత శుభ్రత, త్రాగే నీటిని శుభ్రంగా ఉంచుకోవడం గురించి అవగాహన కల్పించారు. సేంద్రియ ఎరువులు వాడి కూరగాయలు, పండ్లు, ఆకుకూరలను పండించి వంటల్లో ఉపయోగించడం ద్వారా అన్ని రకాల వ్యాధులను అరికట్టవచ్చని వివరించారు. అలాగే, అంతర్జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా కస్తూరిబా హాస్టల్‌లోని పిల్లల కోసం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. బాలికలు అన్ని రంగాలలో (విద్య, ఆరోగ్యం, పరిశుభ్రత, స్కిల్ డెవలప్‌మెంట్, వంట పని, ఆటలు, క్రీడలు) పాల్గొనాలని ఉద్బోధించారు. ఈ సందర్భంగా బాలికలకు సమతుల ఆహారం తీసుకోవడం, మొబైల్‌కు దూరంగా ఉండటం, బయటి వారి మోసపూరిత మాటలు నమ్మకుండా టీచర్లు, తల్లిదండ్రులు చెప్పిన మాటలు వినడం ద్వారా నేటి బాలికలే రేపటి పౌరులుగా ఎదగాలని వివరించారు. అనంతరం బాలికలందరితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సంధ్యారాణి, భాగ్యలక్ష్మి, ఉమ, సుజాత, భాగ్యమ్మ, అరుణ, జ్యోతి, కస్తూరిబా ఇంఛార్జి రజిత, ఉపాధ్యాయ బృందం, కిశోర బాలికలు హాజరయ్యారు.

## కాశిబుగ్గ దసరా ఉత్సవ సమితి సమావేశం



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** వరంగల్ కాశిబుగ్గ దసరా ఉత్సవ సమితి అధ్యక్షులు దూపం సంపత్ ఆధ్వర్యంలో శనివారం ఎస్ఎస్ ఫంక్షన్ హాల్లో కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. 2009 నుంచి 2025 వరకు దసరా ఉత్సవాలకు సేకరించిన నిధులు, ఖర్చులకు సంబంధించిన ఆడిటింగ్‌ను ఎంకే రెడ్డి అసోసియేట్స్ చార్టెడ్ అకౌంటెంట్స్ ద్వారా నిర్వహించారు. సమావేశంలో ఈ ఆడిటింగ్ నివేదికను, అలాగే పరపతి సంఘం లెక్కలను కూడా ఆమోదించారు. పరపతి సంఘం కోశాధికారి వద్ద నిల్వ ఉన్న బకాయిలను రూ. 31-03-2026 లోగా బాకీపడిన వ్యక్తులకు అందజేస్తానని హామీ ఇస్తూ, ప్రామిసరీ నోట్లు మరియు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కాశీబుగ్గ బ్రాంచ్ చెక్కును అందజేశారు. కోశాధికారి బాకీపడిన మొత్తం రూ. 6,23,000/- కాగా, ఇందులో గతంలో టూర్ కోసం అడ్వాన్స్ ఇచ్చిన రూ. 2,90,000/- వసూలు చేయవలసి ఉంది. బాకీపడిన సభ్యుల జాబితా ఉత్సవ సమితి కార్యాలయంలో అందుబాటులో ఉంది. సభ్యులు ఎటువంటి సందేహాలు ఉన్నా కార్యాలయానికి వచ్చి నివృత్తి చేసుకోవచ్చని తెలిపారు. ప్రస్తుతం కాశిబుగ్గ దసరా ఉత్సవ సమితి వద్ద నికరంగా రూ. 29,114/- నిల్వ ఉందని ప్రకటించారు. ఈ సంవత్సరం దసరా ఉత్సవాల నిర్వహణకు ఆలస్యంగా స్పందించిన కారణంగా సరైన సమయంలో అవసరమైన చర్యలు తీసుకోలేకపోవడంతో ఉత్సవాలను నిర్వహించలేకపోయినట్లు ఉత్సవ సమితి తెలిపింది. కరోనా సమయంలో (2020, 2021) దాతల నుంచి నిధులు వసూలు చేయకుండానే సంఘంలోని నిల్వ నిధులతో ఉత్సవాలు నిర్వహించారు. 2024 వరకు విరాళాలు తగ్గుతూ, ఖర్చులు పెరుగుతూ రావడంతో సంఘంలోని నిధులు తగ్గుతూ వచ్చాయి. శాశ్వత నిధి కోసం ప్రయత్నం చేసినప్పటికీ కేవలం కొందరి నుంచి మాత్రమే లభించింది. శాశ్వత నిధి ఇచ్చిన వారిలో గుత్తికొండ నవీన్ (రూ. 40,000), పాము కిరణ్ (రూ. 50,000), గుర్రపు సత్యనారాయణ (రూ. 25,000), కాసం నమశ్శివాయ (రూ. 40,000), కూరాకుల శ్రీనివాస్ (రూ. 25,000) ఉన్నారు. ఈ సమావేశంలో కాశిబుగ్గ దసరా ఉత్సవ సమితి కార్యవర్గాన్ని రద్దు చేస్తున్నట్లు అధ్యక్షుడు ధూపం సంపత్ ప్రకటించారు. ఈ కార్యక్రమంలో సముద్రాల పరమేశ్వర్, మాజీ కార్పొరేటర్లు బయ్య స్వామి, ఓని భాస్కర్, గుల్లపల్లి రాజకుమార్, గోరంట్ల మనోహర్, సిద్దుజు శ్రీనివాస్, రాచర్ల శ్రీనివాస్, గుత్తికొండ నవీన్, వేముల నాగరాజు, ఎరుకల రఘునారెడ్డి, గుర్రపు సత్యనారాయణ, మార్టిన్ లూథర్, గణిపాక సుధాకర్, దాసరి రాజేష్, వలుపదాసు గోపి, తోట బాలరాజు, రామ యాదగిరి, బండారి శ్రీనివాస్, చిలువేరు రాజు, గుజ్జుల రాకేష్ రెడ్డి, క్యాతం రంజిత్, చిలువేరు పవన్, ముల్క సురేష్, బాల మోహన్, చెలగాని రమేష్, సిందం చంద్రశేఖర్, కూరపాటి మహేష్, చింతం రాజు, ఉత్సవ సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# నాణ్యమైన విద్యను అందించడమే ధ్యేయం

• రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క



**వరంగల్ వాయిస్, ములుగు :** పిల్లలకు నాణ్యమైన విద్యను అందించడమే ప్రజా ప్రభుత్వ ముఖ్య ధ్యేయం అని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. రిజర్వ్ ఫారెస్ట్‌లో నివాసం ఉంటున్న గుత్తి కోయ పిల్లలకు చదువు అందించాలనే ఉద్దేశంతోనే ఈ పాఠశాలలు నిర్మించామని ఆమె తెలిపారు. శనివారం ఎస్.ఎస్. తాడ్వాయి మండలంలో మంత్రి సీతక్క రెండు ప్రాథమిక పాఠశాల భవనాలను ప్రారంభించారు: కొండపర్తి క్రాస్ – చెన్నాపురం తోగు వద్ద రూ.3 లక్షల నిధులతో నిర్మించిన పాఠశాల భవనం. లవ్వల స్టేజి – జలగలంచ వద్ద రూ.3 లక్షల నిధులతో నిర్మించిన పాఠశాల భవనం. మంత్రి సీతక్కతో పాటు జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్, ఐటీడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్ చిత్ర మిశ్రా, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవి చందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి తదితరులు ఈ ప్రారంభోత్సవాలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ జలగలంచ, చెన్నాపురం తోగు గుత్తి కోయ గూడాలు రిజర్వ్ ఫారెస్ట్‌లో ఉండటం వల్ల కొన్ని సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని తెలిపారు. అయినప్పటికీ, గుత్తి కోయ పిల్లలకు విద్యను అందించాలనే ముఖ్య ఉద్దేశంతో పాఠశాలలు నిర్మించి ప్రారంభించడం జరిగిందన్నారు. త్వరలోనే దాదాపు 53 గుత్తి కోయ హ్యాబిటేషన్లలో సర్వే నిర్వహించి, సోలార్ విద్యుత్ సౌకర్యాన్ని ఏర్పాటు చేయడం జరుగుతుందని మంత్రి హామీ ఇచ్చారు. జలగలంచ ప్రాంతం రహదారికి పక్కనే ఉన్నందున, పిల్లల తల్లిదండ్రులు జాగ్రత్తగా ఉండాలని, పిల్లలను రోడ్డు వైపు వెళ్లనివ్వకుండా చూడాలని ఆమె ప్రత్యేకంగా సూచించారు. పాఠశాలల ఏర్పాటులో సహకరించిన జిల్లా అధికారులకు మంత్రి ప్రత్యేక అభినందనలు తెలిపారు. అనంతరం, మంత్రి సీతక్క గుత్తి కోయ చిన్నారులతో ముచ్చటించడంతో వారిలో ఉత్సాహం ఉప్పొంగింది. ఈ కార్యక్రమంలో డీపీఓ దేవ్ రాజ్, ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# ఒత్తిడి లేని చదువు మానసిక ఆరోగ్యానికి నెలవు




**వరంగల్ వాయిస్, ఉర్సుగుట్ట :** మానసిక ఆరోగ్యం కూడా శారీరక ఆరోగ్యం వలె చాలా ముఖ్యమని, ఒత్తిడి లేని చదువు విద్యార్థుల ఆరోగ్యానికి ఎంతో మంచిదని ప్రముఖ సైకాలజిస్ట్, కార్పొరేట్ ట్రైనర్ లయన్ రమేష్ దడిగల అన్నారు. అంతర్జాతీయ మానసిక ఆరోగ్య స్వస్థత వారోత్సవాల సందర్భంగా థౌజెండ్ పిల్లర్స్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉర్సు గుట్ట రోడ్డులోని మహాత్మ జ్యోతిబాపూలే కళాశాలలో అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రిన్సిపాల్ అంజి రెడ్డి అధ్యక్షత వహించారు. ప్రపంచంలో ప్రతి ఏడు నిమిషాలకు ఒక బలవన్మరణం జరుగుతోందని, దానికి మానసిక ఒత్తిడే ప్రధాన కారణమని రమేష్ దడిగల పేర్కొన్నారు. విద్యార్థులు ఈ ఒత్తిడి నుంచి ఎలా దూరంగా ఉండవచ్చో పలు టెక్నిక్స్ ద్వారా వారికి నేర్పించారు. బాలల సంక్షేమ సమితి సభ్యులు కజాంపురం దామోదర్ మాట్లాడుతూ ఉద్వేగభరితమైన ఆలోచనలు కలిగే ఈ వయసులో విద్యార్థులు సరైన దిశలో పయనించాలని సూచించారు. గొప్ప శాస్త్రవేత్తల జీవితాలను చదివి స్ఫూర్తిని పొందాలని, విలువైన చదువును నిర్లక్ష్యం చేయకుండా శ్రద్ధ కనబరుస్తూ గమ్యం వైపు సాగాలన్నారు. కార్యదర్శి వైద్యం రాజగోపాల్, జూలూరు చంద్రశేఖర్, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

# పోలియో రహిత సమాజమే లక్ష్యం

డీఎంహెచ్ఓ డాక్టర్ సాంబశివరావు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** పోలియో రహిత సమాజం కోసం అప్పుడే పుట్టిన శిశువు నుంచి ఐదేళ్ల లోపు పిల్లలందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని వరంగల్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి.సాంబశివరావు కోరారు. శనివారం ఆయన ఎంజీఎం ఆసుపత్రిలోని పీపీ (పోస్ట్ పార్టమ్) యూనిట్‌ను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంజీఎం ఆసుపత్రి సిబ్బంది అందరూ పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని దిశానిర్దేశం చేశారు. ఎంజీఎం పీపీ యూనిట్‌లో ఆదివారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలియో చుక్కలు వేయడం జరుగుతుందని తెలిపారు. పీపీ యూనిట్ పరిధిలో మొత్తం 11 చోట్ల పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సూపర్వైజర్ నర్మదా తెలియజేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన స్టేట్ అబ్జర్వర్ ప్రసాద్ కూడా రేపు ఆదివారం జరిగే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్టేట్ అబ్జర్వర్ ప్రసాద్, అశోక్ వరంగల్ ఈవిన్ మేనేజర్ రవీందర్, ఎం.జీ.ఎం. పీపీ యూనిట్ నర్సింగ్ ఆఫీసర్ భాగ్యలక్ష్మి, ఏ.ఎన్.ఎం.లు రాజ సులోచన, కోమల, లక్ష్మీబాయి, రామ రాజేష్ ఖన్నా తదితరులు పాల్గొన్నారు.

# అగ్రకులాల కుట్రలను బీసీలు తిప్పికొట్టాలి

◆ స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల చట్టాన్ని 9వ షెడ్యూల్‌లో చేర్చాల్సిందే



**వరంగల్ వాయిస్, వరంగల్ :** బీసీ రిజర్వేషన్లు దక్కకుండా అగ్రకులాలు చేస్తున్న కుట్రలను బీసీలంతా ఐక్యంగా తిప్పికొట్టాలని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు తాటిపాముల వెంకట్రాములు పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో, విద్యా ఉద్యోగ రంగాల్లో 42 శాతం రిజర్వేషన్ల చట్టాన్ని ఆమోదించడంలో మోడీ ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం వల్లనే రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్ల ప్రక్రియలో అనేక ఆటంకాలు కలుగుతున్నాయని ఆయన విమర్శించారు. శనివారం వరంగల్‌లోని పోచమైదాన్, రాణి రుద్రమదేవి సెంటర్లలో బీసీ హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వెంకట్రాములు, జిల్లా ప్రధాన కార్యదర్శి చింతకింది కుమారస్వామితో కలిసి మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం అసెంబ్లీలో చేసిన చట్టాన్ని గవర్నర్ ద్వారా కేంద్ర ప్రభుత్వానికి పంపినా, బీసీ చట్టాన్ని 9వ షెడ్యూల్లో చేర్చి ఆమోదించాల్సిన మోడీ ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి కారణంగానే బీసీలకు రిజర్వేషన్లు దక్కడం లేదని ఆరోపించారు. బీసీల రిజర్వేషన్లు అమలు జరగాలంటే తొమ్మిదవ షెడ్యూల్లో చేర్చడం ఒక్కటే మార్గమని అనేకమంది న్యాయకోవిదులు, నిపుణులు చెబుతున్నా, కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచకుండా రేవంత్ రెడ్డి ప్రభుత్వం కూడా ఆర్డినెన్స్, జీవోలంటూ కాలయాపన చేస్తోందన్నారు. రిజర్వేషన్ల జీవోపై అగ్రకులాలు న్యాయస్థానాలకు వెళ్ళే అవకాశాలు కల్పించేలా ప్రభుత్వం వ్యవహరించడం మంచిది కాదని హెచ్చరించారు. ఇప్పటికైనా బీసీ రిజర్వేషన్లు సాధించడానికి అన్ని రాజకీయ పార్టీలను, బీసీ సంఘాలను కలుపుకొని ఐక్య కార్యాచరణ ద్వారా బలమైన ఉద్యమాన్ని నిర్మించి, మోడీ ప్రభుత్వం బీసీ చట్టాన్ని 9వ షెడ్యూల్‌లో చేర్చే విధంగా కృషి చేయాలని వెంకట్రాములు డిమాండ్ చేశారు. ఈ అవకాశం తప్పితే బీసీలు తీవ్రంగా నష్టపోతారని ఆందోళన వ్యక్తం చేశారు. బీసీ రిజర్వేషన్ల విషయంలో కోర్టులో గెలిచామని రెడ్లు టపాసులు కాల్చుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనికి నిరసనగా, హైకోర్టులో బీసీ రిజర్వేషన్ల కేసు వేసిన బుట్టెంగారి మాధవరెడ్డి కేసు ప్రతులను దగ్ధం చేస్తూ, ఈ విషయాన్ని బీసీలంతా గమనించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి బొట్ల శ్రీనివాస్, జిల్లా నాయకులు పరికరాల రమేష్, గంగాధరీ జగదీష్, ఓదెల భద్రయ్య, ఎల్. రామకృష్ణ, చంద్రశేఖర్, సయ్యద్ యాకూబ్, ఎండీ సద్దాం హుస్సేన్, ఎండీ షఫీ, లావుడ్య దస్రూ తదితరులు పాల్గొన్నారు.


# శిక్షణ డిప్యూటీ కలెక్టర్‌గా శృతి హర్షిత

జిల్లా కలెక్టర్ ను కలిసిన నూతన అధికారిణి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన గ్రూప్–1 పరీక్ష ద్వారా డిప్యూటీ కలెక్టర్‌గా ఎంపికైన శృతి హర్షిత శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ డాక్టర్ సత్య శారదను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శృతి హర్షిత కలెక్టర్‌కు పూల మొక్కను అందజేశారు. కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆమెకు శుభాకాంక్షలు తెలియజేశారు. శృతి హర్షిత వరంగల్ జిల్లాలోనే డిప్యూటీ కలెక్టర్‌గా శిక్షణ పొందనున్నారు.

# ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డికి కలెక్టర్ సత్య శారద పరామర్శ



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి తల్లి దొంతి కాంతమ్మ ఇటీవల అనారోగ్యంతో మరణించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద శనివారం హనుమకొండలోని ఎమ్మెల్యే నివాసానికి వెళ్లి వారిని పరామర్శించారు. కలెక్టర్ డాక్టర్ సత్య శారద దివంగత కాంతమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం, ఎమ్మెల్యే మాధవరెడ్డికి, వారి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

# పంజాల హాసినికి ఘన సన్మానం



**వరంగల్ వాయిస్, రామన్నపేట :** అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా వరంగల్ రామన్నపేటలోని డాక్టర్ ఏ. రాజేంద్రప్రసాద్ భారతి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కూచిపూడి నృత్య కళాకారిణి పంజాల హాసినిని ఘనంగా సన్మానించారు. రెవెన్యూ కాలనీ నివాసి అయిన హాసిని, ఈ నెల 19న చెన్నై ఎగ్మోర్ మ్యూజియంలో జరగబోయే రాష్ట్రీయ నృత్యాలలో ప్రదర్శన ఇవ్వడానికి ఎంపికైంది. ఈ సందర్భంగా ఆమెను ట్రస్ట్ తరపున శాలువా, మొక్కతో సన్మానించారు. ఈ సందర్భంగా మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ ఏ.రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ బాలురతో సమానంగా బాలికలు అన్ని రంగాలలో ముందంజలో ఉండటం హర్షించదగ్గ విషయమని అన్నారు. హాసినిని స్ఫూర్తిగా తీసుకుని మిగతా బాలికలందరూ అన్ని కార్యక్రమాల్లో ముందుకు రావాలని ఆశించారు. ఇటువంటి కార్యక్రమాలతో మన దేశ కీర్తిని ఇతరులకు చాటి చెప్పాలని కోరారు. సన్మాన గ్రహీత పంజాల హాసిని మాట్లాడుతూ ట్రస్ట్ వారు తనను గుర్తించి సన్మానించడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. ఈ ప్రోత్సాహాన్ని స్ఫూర్తిగా తీసుకొని, తన కళను ఓరుగల్లుకే కాకుండా తెలంగాణకు, దేశవ్యాప్తంగా కూడా పెంపొందించడానికి కృషి చేస్తానని అభిప్రాయపడ్డారు. హాసిని గురువు కొంతం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తన శిష్యురాలు ఎన్నిక కావడం తనకు చాలా సంతోషకరమైన విషయమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజర్ శ్రవణ్, లక్ష్మి, ఝాన్సీ, పుర ప్రముఖులు పాల్గొన్నారు.

# మంత్రి పొంగులేటిపై ఏఐసీసీకి కొండా మురళి ఫిర్యాదు

## మేడారం పనులను సొంత కంపెనీకి ఇప్పించుకుంటున్నారని ఆరోపణ

**వరంగల్ వాయిస్, వరంగల్ :** రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వరంగల్ రాజకీయాల్లో జోక్యం చేసుకుంటూ, మేడారం పనులను తన సొంత కంపెనీకి ఇప్పించుకునేందుకు ప్రయత్నిస్తున్నారని కాంగ్రెస్ సీనియర్ నేత కొండా మురళి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారంపై కొండా మురళి సోనియా గాంధీ, రాహుల్ గాంధీలతో పాటు, తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్‌లకు కూడా ఫిర్యాదు సమర్పించారు. ఫిర్యాదు విషయంలో అధిష్ఠానం నుంచి తమకు సానుకూల స్పందన వచ్చిందని కొండా మురళి తెలిపారు. ముఖ్యంగా దేవాదాయ శాఖలో మంత్రి పొంగులేటి జోక్యం చేసుకోవడంపై ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. వచ్చే ఏడాది జరగబోయే మేడారం జాతరను కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. అయితే, మేడారం టెండర్ల వ్యవహారంలో జరుగుతున్న పరిణామాలపై కొండా మురళి భార్య, మంత్రి కొండా సురేఖ కూడా ఇప్పటికే ఆగ్రహం వ్యక్తం చేస్తూ, ఈ విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో ఈ వివాదం వరంగల్ కాంగ్రెస్ వర్గంలో చర్చనీయాంశంగా మారింది.

# ఎమ్మెల్యే దొంతికి మంత్రులు ఉత్తమ్, సీతక్క పరామర్శ

### దివంగత దొంతి కాంతమ్మ చిత్రపటానికి నివాళులు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నర్సంపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, ఏఐసీసీ సభ్యులు దొంతి మాధవ రెడ్డి తల్లి దొంతి కాంతమ్మ ఇటీవల అనారోగ్యంతో మరణించిన సందర్భంగా, రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు నేడు హనుమకొండలోని వారి నివాసంలో పరామర్శించారు. రాష్ట్ర భారీ నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి నల్లమాద ఉత్తంకుమార్ రెడ్డి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖల మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క, వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు ఈ పరామర్శలో పాల్గొన్నారు. తొలుత మంత్రులు ఉత్తమ్, సీతక్క, ఎమ్మెల్యే నాగరాజు దివంగత దొంతి కాంతమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు, అనంతరం కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ముందుగా హనుమకొండకు విచ్చేసిన మంత్రి ఉత్తంకుమార్ రెడ్డిని మడికొండలో ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు కండువా కప్పి స్వాగతం పలికారు. అనంతరం దొంతి మాధవ రెడ్డి నివాసంలోనే బనకచర్ల కాళేశ్వరం ప్రాజెక్టు అంశంపై మంత్రులు ఉత్తంకుమార్ రెడ్డి, సీతక్క నిర్వహించిన మీడియా సమావేశంలో ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఇతర సహచర ఎమ్మెల్యేలతో కలిసి వీరంతా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పలు కార్పొరేషన్ చైర్మన్లు, ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ రాష్ట్ర, జిల్లా, మండల, డివిజన్ స్థాయి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే నాగరాజు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు నూతన వధూవరులను ఆశీర్వదించారు. హనుమకొండ భీమారంలోని శుభం గార్డెన్స్‌లో ఓజ్జల సులోచన–కొమురయ్య యాదవ్ కుమార్తె రమ్య వివాహం కిరణ్ కుమార్ యాదవ్‌తో జరిగింది. ఈ వివాహ మహోత్సవంలో ఎమ్మెల్యే నాగరాజు పాల్గొని, నూతన వధూవరులను ఆశీర్వదించి, వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే వెంట ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్జీటీ పోస్టులను రద్దు చేయడం సరికాదు

### ◆ పులిచింతల విష్ణువర్ధన్ రెడ్డి



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** ప్రాథమిక పాఠశాలల్లోని ఎస్జీటీ (సెకండరీ గ్రేడ్ టీచర్) సర్ ప్లస్ పోస్టులను రద్దు చేయడం సరికాదని, అలాగే పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల బిల్లులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని తెలంగాణ ప్రాథమిక ఉపాధ్యాయుల సమాఖ్య (టీపీటీఎఫ్) డిమాండ్ చేసింది. తొర్రూరు డివిజన్ కేంద్రంలో జరిగిన టీపీటీఎఫ్ ముఖ్య కార్యకర్తల సమావేశానికి మహబూబాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి పులిచింతల విష్ణువర్ధన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రాథమిక పాఠశాలల్లోని ఎస్జీటీ పోస్టులను తగ్గించి, హైస్కూల్‌లో పీఈటీ (వ్యాయామ ఉపాధ్యాయుడు) పోస్టులు ఇస్తే, ప్రాథమిక పాఠశాలలు నిర్వీర్యం అవుతాయని విష్ణువర్ధన్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. కాబట్టి, ఉన్న పోస్టులతోనే ప్రతి ప్రాథమిక పాఠశాలకు తరగతికి ఒక ఉపాధ్యాయున్ని, ఒక ప్రధానోపాధ్యాయున్ని, ఒక వ్యాయామ ఉపాధ్యాయున్ని నియమించాలని డిమాండ్ చేశారు. సర్వీస్‌లో ఉన్న సీనియర్ టీచర్లకు టెట్ అవసరం లేకుండా ప్రభుత్వం సుప్రీంకోర్టులో త్వరలో రివ్యూ పిటిషన్ వేయాలని కోరారు. కామన్ సీనియారిటీతో ఎల్.ఎఫ్.ఎల్ ప్రమోషన్లు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా కార్యదర్శి టి. రవీందర్ మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలల్లో ఒకరు లేదా ఇద్దరు టీచర్లతో 18 సబ్జెక్టులు బోధిస్తూ నాణ్యమైన విద్య అందించడం సాధ్యం కాదన్నారు. ఈ కార్యక్రమంలో నరసింహులపేట మండల అధ్యక్షుడు క్రాంతి కుమార్, దంతాలపల్లి మండల ప్రధాన కార్యదర్శి చింతల సురేష్, టీపీటీఎఫ్ బాధ్యులు వెంకట్రామ నరసయ్య, ఏ. యాకయ్య, పాషా, బొమ్మ శ్రీనివాస్, కే. ఆంజనేయులు, భోగ సంపత్, కే. సురేష్, అయితా కృష్ణ, మాదాసు రాములు, జి. సంతోష్, ఎం. యాకన్న తదితరులు పాల్గొన్నారు.

# గురుకుల ఉపాధ్యాయులపై పని భారాన్ని తగ్గించాలి

### ◆ టీఎస్ యూటీఎఫ్ నేత సుజన్ ప్రసాదరావు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** గురుకుల ఉపాధ్యాయులపై ఉన్న అధిక పని భారాన్ని, మానసిక ఒత్తిడిని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే తగ్గించాలని తెలంగాణ స్టేట్ యునైటెడ్ టీచర్స్ ఫెడరేషన్ (టీఎస్ యూటీఎఫ్) జిల్లా ప్రధాన కార్యదర్శి సుజన్ ప్రసాదరావు డిమాండ్ చేశారు. శనివారం సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా వరంగల్ జిల్లాలోని పలు గురుకుల విద్యాలయాలను సందర్శించిన అనంతరం ఆయన ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. గురుకుల ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి టీఎస్ యూటీఎఫ్ కట్టుబడి ఉందని, నిరంతరం పోరాడుతుందని ఆయన హామీ ఇచ్చారు. టీఎస్ యూటీఎఫ్ ప్రధానంగా మైనారిటీ వెల్ఫేర్ సొసైటీలో విద్యార్థుల నమోదును పెంచడంలో పూర్తి బాధ్యత ఉపాధ్యాయులదేనని ఒత్తిడి పెంచడం, లేని పక్షంలో శాఖాపరమైన చర్యలకు ఉపక్రమించడం సరికాదన్నారు. కాంట్రాక్ట్, గెస్ట్, పార్ట్ టైం, ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయులకు బేసిక్ పే, 12 నెలల వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి ఎస్.ఎ. రవూఫ్, జిల్లా కార్యదర్శి నామోజు శ్రీనివాస్, ఆడిట్ కమిటీ సభ్యులు పోశాల కుమారస్వామి, ఖిలా వరంగల్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామరాజు, నర్సింహారావు, వరంగల్ మండల ప్రధాన కార్యదర్శి బదావత్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# జనరల్ సీట్లలోనూ బీసీలే పోటీ చేయాలి




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఆధిపత్య కులాల రాజకీయ పార్టీలు ఇచ్చే రిజర్వేషన్లు అవసరం లేదని, బహుజనుల ఓట్లు బహుజనులకే వేసుకుంటే జనరల్ సీట్లన్నిటిలోనూ బీసీలే పోటీ చేసి గెలుపొందవచ్చని బహుజన నాయకులు ఉద్ఘాటించారు. బహుజనులే తెలంగాణ పాలకులని వారు నినదించారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లుపై హైకోర్టు స్టే ఇచ్చిన నేపథ్యంలో, బీసీ చైతన్య వేదిక, ఆల్ ఇండియా ఓబీసీ జాక్ ఆధ్వర్యంలో "బీసీ రిజర్వేషన్లు – ఉద్యమ కార్యాచరణ" అనే అంశంపై శనివారం హనుమకొండ జిల్లా కేంద్రం ప్రెస్ క్లబ్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో బీసీ చైతన్య వేదిక చైర్మన్ ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ, ఆల్ ఇండియా ఓబీసీ జాక్ చైర్మన్ సాయిని నరేందర్, వీసీకే పార్టీ డాక్టర్ జిలకర శ్రీనివాస్, వరంగల్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు వలస సుధీర్, తెలంగాణ ఉద్యమకారుల వేదిక రాష్ట్ర కన్వీనర్ సోమ రామమూర్తి మాట్లాడారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు తాడిశెట్టి క్రాంతికుమార్, చాపర్తి కుమార్ గాడ్గే, గొల్లపల్లి వీరస్వామి, బక్కి యాదగిరి, సోమిడి అంజన్ రావు తదితరులు పాల్గొన్నారు. న్యాయవాదులు చిల్ల రాజేంద్రప్రసాద్, రాచకొండ ప్రవీణ్ కుమార్, కందగట్ల సుధాకర్, అల్లం నాగరాజు, సుందర్ రామ్ పాల్గొన్నారు.

# ఎంజేపీ గురుకుల పాఠశాల ఆకస్మిక తనిఖీ


### ● విద్యార్థులతో భోజనం చేసిన డాక్టర్ సత్య శారద



**వరంగల్ వాయిస్, దుగ్గొండి :** మండలంలోని గిర్నిబావిలోని మహాత్మ జ్యోతిబా పూలే బాలుర గురుకుల పాఠశాలను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద శనివారం ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాల వసతి సదుపాయాలు, విద్యార్థులకు అందుతున్న భోజనం, తరగతుల నిర్వహణ, హాజరు పట్టికలు, విద్యా ప్రమాణాలు, పరిశుభ్రత వంటి అంశాలను ఆమె సమగ్రంగా పరిశీలించారు. కలెక్టర్ విద్యార్థులతో స్వయంగా మాట్లాడి వారి అభిప్రాయాలు, సమస్యలు తెలుసుకున్నారు. వసతి గదులు, డైనింగ్ హాల్, తరగతి గదులు, మరుగుదొడ్ల పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అందించే భోజనం నాణ్యతను పరిశీలించి, వంట సరుకులు (ఆయిల్, పప్పు), పండ్లు, కూరగాయలు ఎప్పటికప్పుడు తాజాగా ఉండేలా చూడాలని సిబ్బందికి సూచించారు. ప్రతిరోజూ మెనూను కచ్చితంగా పాటించాలని ఆదేశించారు. వసతి గృహంలో ఏర్పాటు చేసిన ఫిర్యాదుల పెట్టెను తెరిచి, అందులోని ఫిర్యాదులను పరిశీలించారు. విద్యార్థులు సైన్స్ ల్యాబ్ కావాలని కోరగా, వెంటనే ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులు ఆరోగ్యంగా ఉండేందుకు చదువుతో పాటు క్రీడలు కూడా ఆడాలని సూచించారు. వారి కోసం బాస్కెట్‌బాల్ కోర్టు ఏర్పాటు చేయాలని, అలాగే కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ డాక్టర్ సత్య శారద విద్యార్థులతో కలిసి మధ్యాహ్నం భోజనం చేశారు. కలెక్టర్ వెంట జిల్లా బీసీ సంక్షేమ అధికారి పుష్పలత, మండల ప్రత్యేక అధికారి, జిల్లా ఉద్యానవన అధికారి శ్రీనివాసరావు, తాహసిల్దార్, ప్రిన్సిపాల్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

# లక్ కోసం ఎదురు చూపు

తొలి సినిమాతోనే తెలుగులో గ్రాండ్ సక్సెస్ అందుకున్న భామల్లో ఒకరు కృతిశెట్టి. ఉప్పెన సినిమాతో టాలీవుడ్‌కు పరిచయమైన ఈ ముద్దుగుమ్మ సూపర్ ఫ్యాన్ బేస్ సంపాదించుకుంది. అద్భుతమైన నటనతో కుర్రకారు మనసు దోచేసిన కృతిశెట్టి ఆ తర్వాత శ్యామ్ సింగరాయ్, బంగార్రాజు సినిమాలతో బ్యాక్ టు బ్యాక్ హిట్స్ అందుకుంది. కానీ ఆ తర్వాత చేసిన సినిమాలు మాత్రం కృతిశెట్టికి నిరాశనే మిగిల్చాయని చెప్పాలి. కృతిశెట్టి హీరోయిన్‌గా నటించిన కస్టడీ, మనమే, ది వారియర్, మాచెర్ల నియోజకవర్గం సినిమాలు బాక్సాఫీస్ వద్ద బోల్తా కొట్టాయి. ఈ వరుస ఫెయిల్యూర్స్ టాలీవుడ్‌లో కృతిశెట్టి ప్రయాణంపై ప్రభావం చూపించాయి. అయితే ఇక చేసేదేమి లేక తమిళంలో తన లక్‌ను పరీక్షించుకోవాలనుకున్నకృతిశెట్టి అక్కడ మూడు సినిమాలకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. పాపులర్ యాక్టర్లతో సినిమాలు చేసి.. షూటింగ్స్ పూర్తి చేసినా పలు కారణాల వల్ల ఆలస్యమవుతూ వచ్చాయి. తీవ్ర నిరాశలో ఉండిపోయిన కృతిశెట్టి అభిమానుల కోసం వరుసగా ఆ సినిమాలు విడుదలకు రెడీ అయ్యాయి. పై మూడు సినిమాలు ఒకేసారి ఒకే నెలలో విడుదలకు ముస్తాబవుతున్నాయి. ఈ మూడు ప్రాజెక్టులు కూడా డిసెంబర్ నెలలోనే రిలీజ్ కాబోతుండటం విశేషం.
కృతిశెట్టి కార్తీతో కలిసి నటిస్తున్న వా వాథియార్, ప్రదీప్ రంగనాథన్ లవ్ ఇన్సూరెన్స్, రవిమోహన్ సినిమాలు డిసెంబర్‌లో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాయి. చాలా కాలంగా సరైన బ్రేక్ ఎదురుచూస్తున్న కృతిశెట్టికి ఈ డిసెంబర్ అయినా కలిసి రావాలని కోరుకుంటున్నారు అభిమానులు, ఫాలోవర్లు.



## చాలా రొమాంటిక్ గా ఉంటుంది

కేజీఎఫ్ సినిమాతో హీరోయిన్‌గా బ్లాక్ బస్టర్ హిట్టందుకుంది శ్రీనిధి శెట్టి. తెలుగులో నానితో హిట్ 3లో కలిసి నటించింది. ఈ భామ ప్రస్తుతం సిద్ధుజొన్నలగడ్డతో రొమాంటిక్ ఎంటర్‌టైనర్ తెలుసు కదా సినిమాలో నటిస్తుంది. ఈ మూవీ అక్టోబర్ 17న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సినిమా గురించి ఆసక్తికర విషయాలు షేర్ చేసుకుంది శ్రీనిధిశెట్టి. చిట్ చాట్ సెషన్‌లో శ్రీనిధి శెట్టి మాట్లాడుతూ.. కేజీఎఫ్, హిట్ 3 లాంటి వయొలెన్స్, రక్తపాతం చుట్టూ తిరిగే సినిమాల తర్వాత సున్నిత భావోద్వేగాలతో సాగే సినిమా ఇది. ఈ మూవీ నాకు ఉత్తేజాన్ని కలిగించే మార్పులాంటిది. ఈ చిత్రాన్ని ప్రతీ ఒక్కరూ ఎంజాయ్ చేస్తారని ఆశిస్తున్నానంది. తెలుసు కదా ప్రేమ, ఎమోషన్, నవ్వులు, అందమైన పాటలతో సాగే కమర్షియల్ సినిమా. ఈ సినిమా చూసిన తర్వాత మూవీ లవర్స్ ఒక అందమైన రొమాంటిక్ డ్రామాను చూసినట్టు ఫీల్ అవుతారంది శ్రీనిధి శెట్టి . సినిమాకు పనిచేయడం గురించి మాట్లాడుతూ.. నాకు డైరెక్టర్ నీరజ కోన, సిద్ధు, రాశీ ఖన్నాతో కలిసి నటించే అద్భుతమైన సమయం దొరికింది. నీరజ కోన చాలా సపోర్ట్‌గా నిలిచే వ్యక్తి. ప్రేక్షకులు ఖచ్చితంగా సిద్ధు పాత్రతో ప్రేమలో పడిపోతారు. అతడికి ప్రతీ విభాగంలో అద్భుతమైన ప్రావీణ్యం ఉంది. రాశీఖన్నా చాలా క్రమశిక్షణతో ఉండే వ్యక్తి అని చెప్పుకొచ్చింది.





## విమీతో స్క్రీన్ షేర్ చేసుకోవడం అదృష్టం

### బిగ్ బీ అమితాబ్‌కు బర్త్‌డే విషెస్ చెప్పిన ప్రభాస్

బాలీవుడ్ సూపర్ స్టార్ హీరో అమితాబ్ బచ్చన్ అక్టోబర్ 11న అంటే.. శనివారం 83వ ఏడాదిలోకి అడుగు పెట్టారు. ఈ సందర్భంగా అతడికి సోషల్ మీడియాలో శుభాకాంక్షలు వెల్లువెత్తుఉన్నాయి. టాలీవుడ్ రెబల్ స్టార్ ప్రభాస్ ఇన్‌స్టాగ్రామ్ వేదికగా బిగ్ బీకి బర్త్ డే విషెస్ తెలిపారు. ఈ పోస్టులో 'మీకు దగ్గర ఉండి మీ వర్క్‌ను చూడడం, మీతో కలిసి స్క్రీన్ పంచుకోవడం నాకు దక్కిన గొప్ప గౌరవంగా భావిస్తున్నాను.. మీరు ఇలాంటి పుట్టిన రోజులు మరెన్నో జరుపుకోవాలి అంటూ రెబల్ స్టార్ ప్రభాస్ విషెస్ చేశారు. ఇక, వీరిద్దరి కాంబినేషన్‌లో గతేడాది విడుదలైన 'కల్కి 2898 ఏడీ' థియేటర్లలో బ్లాక్‌బస్టర్ హిట్‌గా నిలిచిన విషయం తెలిసిందే. భారీ బ్జడెట్‌తో తెరకెక్కిన ఈ మూవీ రూ.1000 కోట్లకు పైగా వసూళ్లు రాబట్టింది. ఈ సైన్స్ ఫిక్షన్ చిత్రంలో అమితాబ్ బచ్చన్.. అశ్వత్థామగా, ప్రభాస్ భైరవగా నటించారు. ప్రస్తుతం దీని సీక్వెల్ పనులు కొనసాగుతున్నాయి. అయితే, ప్రస్తుతం 'కల్కి 2'కు సంబంధించిన ఓ వార్త సోషల్ మీడియాలో తెగ వైరల్‌గా మారింది. ఈ భారీ ప్రాజెక్ట్ నుంచి ఇప్పటికే దీపిక పదుకొణెను వైజంతి మూవీస్ తొలగించిన విషయం తెలిసిందే. దీంతో కల్కి 2 సీక్వెల్‌లో ఆమె పాత్రను ఎవరు పోషిస్తారా అనేది ప్రస్తుతం ఆసక్తికరంగా మారింది. ఈ పాత్రలో బాలీవుడ్ క్వీన్ అలియా భట్ నటించనున్నట్లు న్యూస్ వస్తుంది. దీనిపై ఇంకా అధికారిక ప్రకటన కోసం అభిమానులు వేచి చూస్తున్నారు.




## ఓ భారీ సినిమా కోసం కష్టపడుతున్నా

### అల్లుతో సినిమాపై అట్లీ కామెంట్స్

అల్లు అర్జున్ హీరోగా అట్లీ దర్శకత్వంలో ఓ పాన్ ఇండియా సినిమా రూపొందుతోన్న విషయం తెలిసిందే. తాజాగా ఈ సినిమా గురించి అట్లీ ఓ కార్యక్రమంలో మాట్లాడారు. ప్రేక్షకులు ఆశ్చర్యపోయే ప్రపంచాన్ని సృష్టించనున్నట్లు తెలిపారు. తాజాగా బెంగళూర్‌లో జరిగిన పికిల్‌బాల్ టోర్నమెంట్‌కు అట్లీ అతిథిగా హాజరయ్యారు. ఇందులో ఈ మూవీ గురించి మాట్లాడారు. 'ఏదైనా ఒక్క ఆలోచనతోనే ప్రారంభమవుతుంది. ఈ సినిమాతో ప్రేక్షకులకు కొత్త అనుభూతిని ఇవ్వడానికి మేం ప్రయత్నిస్తున్నాం. ఆడియన్స్ ఆశ్చర్యపోయేలా కొత్త ప్రపంచాన్ని సృష్టించనున్నాం. దేవుడు మా ప్రయాణంలో ప్రతి అడుగులోనూ తోడున్నాడు. ఆయన దయ వల్ల అంతా మేం అనుకున్నట్లే జరుగుతుందని ఆశిస్తున్నా. ఇంత భారీ ప్రాజెక్ట్‌ను రూపొందించడం రిస్క్‌గా అనుకోవడం లేదు. నేను దీన్ని ఎంజాయ్ చేస్తున్నా మరి కొన్ని నెలల్లో మీరు దీన్ని ఆస్వాదిస్తారని అట్లీ తెలిపారు. ఇక తాజాగా వచ్చిన 'కాంతార చాప్టర్ 1'పై అట్లీ ప్రశంసలు కురిపించారు. అదో అద్భుతమన్నారు. 'కాంతార 1'ను నేను మొదటి రోజు చూశాను. విదేశాల్లో ఉండడంతో థియేటర్‌కు వెళ్లడం కోసం దాదాపు రెండున్నర గంటలు డ్రైవ్ చేసుకుంటూ వెళ్లాను. సినిమా చూడగానే రిషబ్‌కు ఫోన్ చేసి అభినందించా. నేను చాలా గౌరవించే వ్యక్తుల్లో రిషబ్ ఒకరు. నాకు మంచి స్నేహితుడు. ఇలాంటి సినిమాను రూపొందించడం ఎంత కష్టమో ఒక దర్శకుడిగా నాకు తెలుసు. రిషబ్ ఎంతోమందికి స్ఫూర్తి. ఆయన ఈ సినిమాతో మరో జాతీయ అవార్డు గెలుచుకోవాలని ఆశిస్తున్నానని అట్లీ తెలిపారు.




## రౌడీ జనార్ధన్‌గా వస్తున్న విజయ్ దేవరకొండ

వరుస సినిమాలతో అలరించేందుకు సిద్ధమవుతున్నారు విజయ్ దేవరకొండ.. ఈ హీరో మరో చిత్రం 'రౌడీ జనార్దన్' ప్రారంభమైంది. రవి కిరణ్ కోలా దర్శకత్వం వహించనున్న ఈ సినిమాలో విజయ్ సరసన కీర్తి సురేశ్ నటిస్తున్నారు. శనివారం పూజా కార్యక్రమాలతో ఈ సినిమా ప్రారంభమైంది. నిర్మాత అల్లు అరవింద్ కల్‌ఆప్ కొట్టారు. దీనికి సంబంధించిన ఫొటోలు నెట్టింట షేర్ అవుతున్నాయి. ఈ కార్యక్రమానికి నిర్మాతలు దిల్ రాజు, అల్లు అరవింద్ హాజరయ్యారు. 'రాజావారు రాణిగారు' సినిమాతో తెలుగు ప్రేక్షకులను మెప్పించిన దర్శకుడే రవికిరణ్ కోలా. తొలి మూవీకి భిన్నంగా ఈసారి విజయ్‌తో యాక్షన్‌కు ప్రాధాన్యం ఉన్న కథను తెరకెక్కించనున్నారు. ఈనెల 16 నుంచి ముంబయిలో ఈ మూవీ రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుంది. మొదటిసారి విజయ్ సరసన కీర్తి సురేశ్ కనిపించనుండడంతో దీనిపై ఆసక్తి ఏర్పడిరది.





# ప్రణాళికతోనే గ్రామ అభివృద్ధి సాధ్యం

- ఏటూరు నాగారాన్ని మున్సిపాలిటీగా ఏర్పాటు చేస్తాం
- పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క

**వరంగల్ వాయిస్, ములుగు :** గ్రామాలు అన్ని విధాలా అభివృద్ధి చెందాలంటే మాస్టర్ ప్లాన్ తప్పనిసరి అని, దాని ద్వారానే అభివృద్ధి సాధ్యమవుతుందని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. రానున్న రోజుల్లో ఏటూరు నాగారం ప్రాంతాన్ని మున్సిపాలిటీగా ఏర్పాటు చేస్తామని ఆమె ప్రకటించారు. శనివారం ఏటూరు నాగారం మండల కేంద్రంలో రూ.కోటి నిధులతో నిర్మించనున్న వెజ్, నాన్ వెజ్ మార్కెట్ నిర్మాణ పనులకు మంత్రి సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. లతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ ఏటూరు నాగారం చిన్న పల్లెటూరిగా ప్రారంభమై, నేడు రెవెన్యూ డివిజన్‌గా, 5 మండలాలకు కేంద్రంగా, రెండు రాష్ట్రాలకు సరిహద్దుగా ప్రధాన కేంద్రంగా నిలిచిందని అన్నారు. ఈ ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకొని, మండల కేంద్రాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేయడానికి ప్రణాళిక సిద్ధం చేశామని తెలిపారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజల రోజువారీ అవసరాల కోసం రూ.1 కోటితో కూరగాయల మార్కెట్ నిర్మాణం చేపట్టడం జరుగుతుందన్నారు. ములుగు-ఏటూరు నాగారం మధ్య ఉన్న బస్ డిపో సమస్యపై రవాణా శాఖ మంత్రితో చర్చించి, ఏడున్నర కోట్ల రూపాయలతో ఏటూరు నాగారంలో బస్ డిపో ఏర్పాటుకు శంకుస్థాపన చేయడం జరిగిందని తెలిపారు. ఏటూరు నాగారంలో డిపో ఏర్పాటు వల్ల చుట్టుపక్కల ఐదు మండలాలకు, ఇతర రాష్ట్రాలకు వెళ్లే ప్రయాణికులకు సౌకర్యంగా ఉంటుందన్నారు. ఏటూరు నాగారం నుంచి గోదావరి నది వరకు రెండున్నర కోట్ల రూపాయలతో సీసీ రోడ్డు మంజూరు చేయడం జరిగింది. అందరి సహకారంతో ఈ ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేస్తామని, రానున్న రోజుల్లో మండల కేంద్రాన్ని మున్సిపాలిటీగా ఏర్పాటు చేయడం జరుగుతుందని మంత్రి హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. మాట్లాడుతూ ఏటూరు నాగారంలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా వెజ్, నాన్ వెజ్ మార్కెట్ నిర్మాణం చేపట్టడం హర్షించదగ్గ విషయమని అన్నారు.

జిల్లాలోని ములుగు, ఏటూరు నాగారం పట్టణ కేంద్రాల్లో అన్ని మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేస్తామన్నారు. స్థానిక మంత్రి సీతక్క చొరవతో సింగరేణి సంస్థ నుంచి ప్రత్యేక నిధులతో ఈ మార్కెట్ నిర్మాణం జరుగుతుందని తెలిపారు. భవిష్యత్తులో గ్రౌండ్, స్విమ్మింగ్ పూల్ వంటి అభివృద్ధి పనులను కూడా చేపడతామని కలెక్టర్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవి చందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, పంచాయతీ రాజ్ ఈఈ అజయ్ కుమార్, ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.





# రాష్ట్ర ఖ్యాతి పెంచాలి

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** తెలంగాణ ఖోఖో సంఘం ఆదేశాల మేరకు, ఉమ్మడి వరంగల్ జిల్లా ఖోఖో సంఘం ఆధ్వర్యంలో సౌత్ జోన్ ఖోఖో నేషనల్స్‌లో పాల్గొనబోయే తెలంగాణ రాష్ట్ర మహిళా, పురుషుల జట్ల ఎంపిక పోటీలు శనివారం హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్, ఖోఖో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఎథిక్స్ కమిషన్ కన్వీనర్, అలాగే తెలంగాణ రాష్ట్ర, వరంగల్ జిల్లా ఖోఖో సంఘాల అధ్యక్షులు జంగా రాఘవరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా జంగా రాఘవరెడ్డి మాట్లాడుతూ, గత 15 సంవత్సరాలుగా తెలంగాణ ఖోఖో క్రీడాకారుల అభివృద్ధి కోసం ఎంతో కృషి చేస్తున్నామని, వారికి అత్యున్నత స్థాయిలో సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు. దీనికి అనుగుణంగానే దేశంలో తెలంగాణను ప్రథమ స్థానంలో నిలపాలని, క్రీడాకారులు కూడా వ్యక్తిగతంగా ఉన్నత స్థానాలలో స్థిరపడాలని ఆకాంక్షించారు. రాబోయే సంవత్సరం జనవరి 2026లో కాజీపేటలో భారీ ఎత్తున, కనివిని ఎరుగని రీతిలో జాతీయ స్థాయి సీనియర్ ఖోఖో పోటీలను నిర్వహిస్తున్నామని, అందులో కూడా తెలంగాణను మొదటి స్థానంలో నిలపాలని ఆయన ఆకాంక్షించారు. ఈ పోటీలలో ఎంపికైన క్రీడాకారులు త్వరలో కర్ణాటక రాష్ట్రంలో జరిగే దక్షిణ భారత జాతీయ స్థాయి ఖోఖో క్రీడలలో తెలంగాణ రాష్ట్రం పక్షాన పాల్గొంటారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఖోఖో సంఘం ప్రధాన కార్యదర్శి శ్రీనాతి కృష్ణమూర్తి, హ్యాండ్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్యామల పవన్ కుమార్, హనుమకొండ జిల్లా లయన్స్ క్లబ్ అధ్యక్షులు పి.సురేష్ బాబు, పెటా టీఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి, ఉమ్మడి వరంగల్, కరీంనగర్, హైదరాబాద్, నిజామాబాద్, పెద్దపల్లి జిల్లాల కార్యదర్శులు, తెలంగాణ ఖోఖో సంఘ బాధ్యులు తదితరులు పాల్గొన్నారు. ఉమ్మడి పది జిల్లాల నుండి దాదాపు 120 మంది క్రీడాకారులు ఈ ఎంపిక పోటీలలో పాల్గొన్నారు.

# రైతులు ఆధునిక పద్ధతులు పాటించాలి

□ కలెక్టర్ డాక్టర్ సత్య శారద

**వరంగల్ వాయిస్, గీసుకొండ :** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రారంభించిన 'ప్రధానమంత్రి ధన ధాన్య కృషి యోజన' కార్యక్రమం ప్రత్యక్ష ప్రసారాన్ని గీసుగొండ మండలం, కొనాయమాకుల రైతు వేదికలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద వీక్షించారు. ఈ కార్యక్రమం భారత ప్రభుత్వ వ్యవసాయం, రైతు సంక్షేమం, మత్స్య, సహకార, ఆహార ప్రాసెసింగ్ పరిశ్రమల మంత్రిత్వ శాఖలు మరియు పశుసంవర్ధక, పాల ఉత్పత్తుల శాఖల సంయుక్త ఆధ్వర్యంలో న్యూఢిల్లీలోని పూసా పరిశోధన కేంద్రం నుంచి ప్రసారం చేయబడింది. ప్రధానమంత్రి మోడీ పప్పు దినుసులలో ఆత్మనిర్భరత మిషన్‌ను ప్రారంభించారు. వీటితో పాటు, ఏఐఎఫ్ (వ్యవసాయ మౌలిక సదుపాయాల నిధి) క్రింద 1068 ప్రాజెక్టులు, పశుసంవర్ధక శాఖ క్రింద 18 ప్రాజెక్టులు, మత్స్యశాఖ క్రింద 09 ప్రాజెక్టులు, ఆహార ప్రాసెసింగ్ పరిశ్రమల క్రింద 16 ప్రాజెక్టులను ప్రారంభించినట్లు తెలిపారు. 10,000 రైతు ఉత్పత్తిదారు సంఘాలలో (ఎఫ్ పీఓఎస్) 50 లక్షల మంది రైతులను సభ్యులను చేయనున్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రులు శివరాజ్ సింగ్ చౌహాన్,రాజీవ్ రంజన్ సింగ్ (లాలన్ సింగ్), రాష్ట్ర మంత్రులు శ్రీ రామ్‌నాథ్ ఠాకూర్, శ్రీ భగీరథ్ చౌదరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ రైతులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని, ఆధునిక లాభదాయకమైన సాగు పద్ధతులపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి కె. అనురాధ, డీవీఏహెచ్ఓ డా.ఎం.బాలకృష్ణ, డీహెచ్ఎస్ఓ శ్రీ శ్రీనివాస రావు, డీసీఓ నీరజ, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ పుష్పలత, ఆర్.ఎ.ఆర్.ఎస్. శాస్త్రవేత్త డా.ఎం.మధు, ఏడీఏ, తహసీల్దార్, ఎంపీఓ, ఏఓ, ఇతర వ్యవసాయ, వెటర్నరీ, ఉద్యాన అధికారులు, విస్తరణ అధికార్లు, సీఈఓలు, ఎఫ్‌పీఓలు మరియు అభ్యుదయ రైతులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# వరంగల్‌ను స్టార్టప్ హబ్‌గా తీర్చిదిద్దుతాం

- కేయూ టి-హబ్ తో త్వరలో ఒప్పందం
- రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు
- పూర్వ విద్యార్థుల మద్దతు కీలకం

**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** కాకతీయ విశ్వవిద్యాలయం త్వరలో టి-హబ్ తో అవగాహన ఒప్పందం (ఎంఓయూ) చేసుకోనుందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. వరంగల్ వంటి ద్వితీయ శ్రేణి నగరాలను ఆవిష్కరణలు, ఇంక్యుబేషన్, స్టార్టప్‌ల కోసం హబ్‌లుగా అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం ప్రోత్సహించనున్నట్టు ఆయన ప్రకటించారు. హైదరాబాద్ ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో శనివారం నిర్వహించిన కాకతీయ యూనివర్సిటీ ఫార్మసీ కళాశాల స్వర్ణోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పూర్వ విద్యార్థుల మద్దతుతో కాకతీయ విశ్వవిద్యాలయం తన పునః కీర్తిని సాధిస్తుందని మంత్రి శ్రీధర్ బాబు విశ్వాసం వ్యక్తం చేశారు. ఆరంభ దశలో కళాశాల అనేక సవాళ్లు ఎదుర్కొన్నప్పటికీ, నిబద్ధత కలిగిన అధ్యాపక బృందంతో దేశంలోని టాప్ 10 ఫార్మసీ కళాశాలల్లో ఒకటిగా నిలిచిందన్నారు. విశ్వవిద్యాలయం అభివృద్ధిలో పూర్వ ఉపాధ్యాయులు, విద్యార్థుల పాత్ర గొప్పదని ప్రశంసించారు. విశ్వవిద్యాలయం వైస్-చాన్సలర్ ప్రొఫెసర్ కె. ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ, రుసా (RUSA) వంటి సంస్థల మద్దతుతో ఫార్మసీ కళాశాల మరింత అభివృద్ధి చెందుతోందని తెలిపారు. ఇప్పటివరకు ఈ విశ్వవిద్యాలయం నుండి 600 మందికి పైగా పీహెచ్.డీలు పూర్తిచేశారని, వారిలో చాలామంది పరిశోధకులు, స్టార్టప్ వ్యవస్థాపకులుగా ఉన్నత స్థానాల్లో పనిచేస్తున్నారని వివరించారు. డిసెంబర్‌లో రాష్ట్ర స్థాయి హ్యాకథాన్‌ను నిర్వహించనున్నట్లు తెలిపారు. కేహబ్, టిహబ్ అవగాహన ఒప్పందం అమలుకు విశ్వవిద్యాలయం పూర్తి మద్దతు ఇస్తుందని తెలిపారు.




## మెగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం..

సెప్టెంబర్‌లో విశ్వవిద్యాలయంలో, అలాగే సెప్టెంబర్ చివరిలో యూఎస్‌ఏలో పూర్వ విద్యార్థుల సమావేశాలు జరిగినట్లు ప్రొఫెసర్ రెడ్డి వెల్లడించారు. అంతేకాక, డిసెంబర్‌లో విశ్వవిద్యాలయంలో మెగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరగనుందని తెలిపారు. మరో మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ కాకతీయ యూనివర్సిటీ ఫార్మసీ కళాశాల వారసత్వాన్ని ప్రశంసించారు. యూనివర్సిటీ తన పాత పేరు, కీర్తిని తిరిగి తీసుకురావాలని ఆకాంక్షించారు. విశ్వవిద్యాలయం పాత ఉపాధ్యాయుల దార్శనికతను ఆయన ప్రశంసించారు. ఈ సందర్భంగా కళాశాలలో పని చేసిన పూర్వ ఉపాధ్యాయులను సత్కరించారు. అలాగే, పూర్వ విద్యార్థుల సావనీర్ మరియు రెండు పుస్తకాలను విడుదల చేశారు. విద్యా, ప్రయోగశాలల అభివృద్ధిలో పూర్వ విద్యార్థుల మద్దతు ప్రశంసనీయమని సభాసదులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జె. కృష్ణవేణి సహా అనేక మంది ఫార్మసీ పూర్వ విద్యార్థులు, ప్రముఖులు పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com